మండే ఎండ.. జాగ్రత్తలే అండ


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

- ఉపాధి వేతనదారులపై ప్రభావం
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

టెక్కలి:

ప్రస్తుతం భానుడు భగభగమంటున్నాడు. గత వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో ప్రతిరోజూ ఉపాధి పనికి వెళ్లేవారికి వడదెబ్బ ప్రమాదం పొంచి ఉంది. అయితే ఉపాధి పనులకు వెళ్తున్న వేతనదారులు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాకుండా పనిచేస్తున్న సమయంలో శరీరంలో ఎటువంటి మార్పులు కనిపించినా తక్షణమే సురక్షితమైన చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. నిర్ణీత వేళలు దాటి ఉపాధి పనులు చేయకపోవడం ఎంతో మంచిదని సూచిస్తున్నారు. టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి తదితర మండలాల్లో సుమారు 13 వేల మంది ప్రస్తుతం ఉపాధి పనులు చేస్తున్నారు.


ఎండలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఉపాధి పనులకు వెళ్తున్న వేతనదారులంతా తగినంత నీరు తీసుకోవాలి. శరీరం డీహైడ్రేషన్‌కు గురవ్వకుండా ఓఆర్‌ఎస్ ద్రావణం లేదా నిమ్మకాయ నీరు తాగాలి.
- ఎండలు తీవ్రంగా ఉన్నపుడు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు పని చేయడం మానుకోవాలి. ఉదయం, సాయంత్రం ఎండ తీవ్రం కాకుండా పనులు ముగించుకోవాలి.
- పని ప్రదేశాల్లో శరీరం అలసటగా మారి నీరసం, వాంతులు, ఇతరత్రా మార్పులు కనిపిస్తే తక్షణమే విశ్రాంతి తీసుకుని వైద్యులను సంప్రదించాలి.
- ఎండలు తీవ్రంగా ఉన్నపుడు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, వృద్ధులు ఉపాధి పనులకు వెళ్లకపోవడం శ్రేయస్కరం.

అవగాహన కల్పిస్తున్నాం

ఉపాధి పనులకు వెళ్తున్న వేతనదారులు వడదెబ్బకు గురి కాకుండా వారికి అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఎండ తీవ్రతరం కాక మునుపే పనులు ముగించాలని చెబుతున్నాం. అనారోగ్య సమస్యలు ఉన్నవారు పనులకు రావొద్దని సూచిస్తున్నాం.
– బి.హరిప్రసాద్, ఏపీవో, టెక్కలి

మంచినీరు తాగాలి

ఉపాధి పనులకు వెళ్లేవారు శరీరంలో నీటి శాతం అధికంగా ఉండేవిధంగా చూసుకోవాలి. ఎండలు తీవ్రంగా ఉన్నపుడు పనులకు వెళ్లకపోవడం సురక్షితం. వాంతులు, తల తిరగడం, ఇతరత్రా సమస్యలు ఎదురైనపుడు తక్షణమే వైద్యులను సంప్రదించాలి.
– బీఆర్‌కే మహరాజ్, వైద్యుడు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

క్లుప్తంగా

పాఠశాల ప్రహరీ ప్రారంభం


ప్రహరీ ప్రారంభిస్తున్న ఎంఈవో లక్ష్మణరావు

మందస: మండలంలోని లింబుగం గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రాంగణానికి గ్రామస్తుల సాయంతో నిర్మించిన ప్రహరీ గోడను ఎంఈవో ఎం.లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో తాత్కాలిక వంటగది, 2 తరగతి గదులకు రంగులు వేయించిన విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గున్న రాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటరావు, విజయ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి

పలాస: మండలంలో నీటి తీరువాను తక్షణమే వసూలు చేయాలని పలాస తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, ఆర్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో బకాయిలను గుర్తించి వసూలు చేయాలని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో గృహ నిర్మాణ సంస్థ ఇళ్ల కోసం తగిన స్థలాలను గుర్తించి జాబితాను తయారు చేయాలని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఉదారత


విద్యా ఉపకరణాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కంచిలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఉదారత చాటుకున్నారు. పాఠశాలలో అన్ని తరగతులకు అవసరమైన దాదాపు రూ.20 వేలు విలువ చేసే సామాగ్రి విద్యార్థుల సౌకర్యార్థం హెచ్‌ఎం సీతారాంనాయుడుకు సోమవారం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, బొగాబెణి పంచాయతీ సర్పంచ్ గణప సింహాచలం, గుజ్జూరు సునీల్, బడాయి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలి


ఆర్డీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

టెక్కలి: పట్టణంలో సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జె.రామ్‌జీ, ఎస్.లక్ష్మీనారాయణ, నరేంద్రచక్రవర్తి, ఎస్.నాగమణి, రాజారావు తదితరులు కోరారు. అలాగే కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 26 వినతులు అందినట్లు సిబ్బంది వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ గీత

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ ఎస్.గీత కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సమస్యలపై పలుమార్లు వినతులు అందజేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రాజు, కౌన్సిలర్ లీలారాణి, నాగరాజు, కోటేశ్వరరావు, తవిటయ్య, జానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యనందించాలి


మాట్లాడుతున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: రానున్న విద్యా సంవత్సరంలో మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచిత విద్యనందించాలని ఎంఈవో కురమాన అప్పారావు సూచించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేటు విద్యాలయాల యాజమాన్యాలతో సమావేశం సోమవారం నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు వెబ్‌సైట్‌లో ఒకటో తరగతికి అర్హత గల పేద విద్యార్థుల పేర్లను నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యత వహించాలి


మాట్లాడుతున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం: వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఎంఈవో కె.అప్పారావు సూచించారు. పురపాలక సంఘంలోని పంజావీధి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ధనలక్ష్మి అధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలన్నారు. అలాగే చక్కగా హోంవర్క్‌లు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేసుకోవాలి

టెక్కలి రూరల్: రైతులు తమ భూముల నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా సరైన ఎరువులు వాడితే పెట్టుబడులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని కోటబొమ్మాళి మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.గోవిందరావు సూచించారు. మట్టి నమూనా సేకరణలో భాగంగా ఆయన తన సిబ్బందితో కలిసి సోమవారం కోటబొమ్మాళి మండలం సరియాపల్లి గ్రామంలో మట్టి నమూనాలు సేకరించారు. ప్రతీ రైతు తమ భూముల్లో భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలో 2025 ఖరీఫ్ సాగుకు ముందు 1,076 మట్టి నమూనాలు సేకరించి, రైతులకు ధ్రువపత్రాలు అందజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తెలిపారు. జింకిభద్ర, పలాసపురం గ్రామాల్లో మట్టి నమూనాలు తీసే విధానంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. మట్టి నమూనాల ఉపయోగాలు రైతులకు తెలియజేశారు. పలువురు రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


సోంపేట: మట్టి నమూనాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మున్సిపల్ గ్రీవెన్స్‌కు 14 వినతులు

కాశీబుగ్గ: పలాస – కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు 14 వినతులు అందాయి. కమిషనర్ నడిపేన రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆస్తిపన్ను పేరు మార్పు, డెత్ సర్టిఫికెట్లు, బర్త్ సర్టిఫికెట్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు వంటి దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలవారు మున్సిపల్ కమిషనర్‌కు నేరుగా సంప్రదించవచ్చునని సూచించారు.

ఒకేషనల్ విద్యతో భవిష్యత్‌లో అవకాశాలు



కవిటి: సర్టిఫికెట్లతో విద్యార్థులు


కంచిలి: సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో చిట్టిబాబు తదితరులు

కంచిలి: ఒకేషనల్ విద్యను అభ్యసించినవారికి భవిష్యత్తులో చక్కని అవకాశాలు వస్తాయని మండల విద్యాశాఖాధికారి–2 కె.చిట్టిబాబు అన్నారు. మండలంలో జాడుపూడి గ్రామంలోని కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు ఒకేషనల్ విద్యలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం పూర్తి చేశారు. దీంతో వీరికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని విద్యాలయం ఆవరణలో ప్రిన్సిపాల్ బి.రజనీకుమారి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు పాల్గొన్నారు.

కవిటి: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న వృత్యంతర శిక్షణతో విజ్ఞానం పెరుగుతుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం తులసీబాయి అన్నారు. రాజపురం బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎలక్ట్రానిక్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వీల్‌చైర్స్ పంపిణీ


వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న అధికారులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వీల్‌చైర్లను సోమవారం మండల విద్యాశాఖాధికారి ఎల్వీ ప్రతాప్ చేతులమీదుగా పంపిణీ చేశారు. వికలాంగులైన చిన్నారులు కోసం ప్రభుత్వం ప్రత్యేక వైద్యం, విద్యతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాళ్ల సంజీవ్‌రావు, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల హెచ్‌ఎం డి.గోవిందరావు, ఉపాధ్యాయులు జి.పాపారావు, భవిత కేంద్రం ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు అస్సాంలోని దులియాజన్‌లో శ్రీరామ సేవా సంఘం అధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్దాన ప్రాంతంలో పుట్టి పెరిగి ఉపాధి నిమిత్తం పలు ప్రాంతాలకు వలస వెళ్లినవారు ఒక్కచోట చేరి పలకరించుకున్నారు. అనంతరం అనేక ప్రజాసేవా కార్యక్రమాలు చేపట్టి మరణించిన ప్రజా సేవకుల కుటుంబాలకు సన్మానం చేశారు. అందరూ కలిసి గ్రామ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దులియజన్ శ్రీరామ సేవ సంఘ అధ్యక్షుడు పొట్టి సాంబమూర్తి, కార్యదర్శి తిరుపతిరావు, కోశాధికారి లండ నరేష్, ఉపాధ్యక్షులు మోస ఈశ్వరరావు, బర్రి జోగారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రజా సేవకుల కుటుంబాలను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

గిట్టుబాటు ధర కల్పించాలి


మాట్లాడుతున్న గోవిందరావు

పలాస: ఉద్దానం ప్రాంత ప్రజల జీవనాధారమైన జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. పలాసలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడిబోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జీడికి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీడిపప్పు ధర ఆకాశానికి అంటుతుంటే, జీడి పిక్కల ధర పాతాళానికి పడిపోతుందని ఆవేదన వ్యక్తం చెందారు. 80 కిలోల జీడిపిక్కలకు రూ.16 వేలు ధర చెల్లించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు కె.మోహనరావు, జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, ఎన్.గణపతి పాల్గొన్నారు.

రీసర్వేను వేగవంతం చేయాలి

పలాస: మండలాల్లో రెండో దశ రీసర్వేను వేగవంతం చేయాలని పలాస ఆర్డీవో జి.వెంకటేష్ సూచించారు. కిష్టుపురం, వజ్రపుకొత్తూరు, మహాదేవుపురం గ్రామాల్లో రెండో దశ రీసర్వే పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న సర్వే కార్యక్రమాలను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. సర్వే సిబ్బందికి తగిన సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు చలపతిరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం


సౌండ్ బాక్స్‌ను వితరణగా అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం మరింత అవసరమని సోంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జానకిరాం అన్నారు. ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు, పాఠశాలకు మైక్‌సెట్, సౌండ్ బాక్స్, రెండు ఫ్యానులు వితరణగా సోమవారం అందజేశారు. దీంతో వారికి పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

• చినుకుపడితే చెరువే..!



జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో అనేక సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా చిన్నపాటి వర్షంపడినా గ్రామంలో ప్రధాన వీధి అధ్వానంగా మారుతోంది. ఈ సీసీ రోడ్డు లోతట్టుగా ఉండడంతో చెరువును తలపిస్తోంది. దీంతో వాహనదారులు, స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.
– వజ్రపుకొత్తూరు రూరల్

• ట్రాఫిక్ జామ్

టెక్కలి తెంబూర్ రోడ్డు జంక్షన్ వద్దనున్న రైల్వే ట్రాక్ మధ్యలో పోర్టు లారీ ఒక్కసారిగా ఆగిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోర్టు నుంచి క్వారీ రాళ్లు తీసుకెళ్లేందుకు వెళ్తున్న లారీ బ్యాటరీ ట్రాక్‌పై డౌన్ అవ్వడంతో ఆగిపోయింది. దీంతో సుమారు 20 నిమిషాలు పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
– టెక్కలి రూరల్



• హోమియో వైద్య శిబిరం

హోమియో వైద్యంతో శాశ్వత ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని హోమియో వైద్యుడు డాక్టర్ దుర్గాప్రసాద్ పట్నాయక్ అన్నారు. మండలంలోని నువాగడ గ్రామంలో స్థానిక సర్పంచ్ సబితా గొమాంగో ఆధ్వర్యంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి, అవసరమైన ముందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
– కంచిలి



సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య


కంచిలి: కత్తివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పలాస: బ్రాహ్మణతర్లాలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ


ఇచ్ఛాపురం రూరల్: మానవహారం చేపడుతున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని డొంకూరు జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు సరోజని, సాయిరాంలు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం డొంకూరు, లక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, బ్యాగులు వంటి వస్తువులను విద్యాశాఖ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కమలాకర్, పీడీ వజీర్, పాఠశాల చైర్మన్ కె.జానకిరావు, జి.శంకరరెడ్డి, శ్రీహరి, నూకయ్య, వెంకటేష్, వెంకటరమణ, కృష్ణారావు, గణపతి, వల్లభరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్వీ రమణరావు, విద్యా కమిటీ చైర్మన్ ఆర్.బాలశంకరం, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, మధుబాబు, రమేష్, పద్మలోచన్, జనార్ధనరావు, పద్మ, బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: ప్రభుత్వ బడుల్లో చిన్నారులను చేర్పించాలని ఎంఈవో–2 కె.చిట్టిబాబు కోరారు. మండలంలోని కత్తివరం గ్రామంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవీ బెహరా ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితుల బహిష్కరణ అప్రజాస్వామికం


నిరసన తెలుపుతున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

టెక్కలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలోని మల్లాం గ్రామంలో దళితుల సాంఘిక బహిష్కరణ అప్రజాస్వామికమని దళిత సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం టెక్కలి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఇటువంటి దుశ్చర్యకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాయాలను ప్రశ్నిస్తానంటూ చెప్పిన డిప్యూటీ సీఎం ఇప్పుడు ఎక్కడికి వెళ్లిపోయారంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు చల్లా రామారావు, బసవల గోపాల్, ఆట్ల రాహుల్, కె.కామేశ్వరరావు, కె.రవికుమార్ గాంధీ, ఎస్.గోపినాథ్, జె.బాబురావు, ఎం.మాధవరావు, కళ్లేపల్లి గోవింద్, ఎస్.నీలాచలం, బి.తాతారావు, ఎస్.దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన ఉపకరణాలు అందజేత

కవిటి: మండలంలోని బొరివంక క్లస్టర్ పరిధిలో ఉన్న జెడ్పీ, మండల పరిషత్ యాజమాన్యాల్లోని 20 పాఠశాలలకు బోధన ఉపకరణాలు సోమవారం బొరివంకలో అందజేశామని చైర్మన్ ససపల రామకృష్ణ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం నిధుల నుంచి స్కూల్ గ్రాంట్‌ను వినియోగించి వీటిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. సామగ్రిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ సెక్రటరీ జి.శ్రీధర్‌రావు, సీఆర్పీ బాగా తులసయ్య తదితరులు పాల్గొన్నారు.